రెండోవారం

# మల్లెమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకథలు

ఆ యాల నేను రావిగుంటపల్లె రచ్చబండ మీద కూసోమండగా మా ముంగర ఇస్రాయేలు బావ వచ్చిండు.

'ఏంది సుదయ్య బావ? పట్నం సంగతులు జెప్పు' అన్నడు.

'ఆ పట్నం సంగతేం సెప్పేదిలే! మనూరి కతలు జెప్పు మన కతలిని శానా ఏళ్లయింది'. అవన్నా.

ఇస్రాయేలు బావ కండువా దులిపి సుట్టెలిగించిండు.

'కతలంటె కలిపించిన కతలు గాదు. నిజ్జంగా జరిగిన కత జెపతా ఇను. పందుల్ని యేటాడ బోయిన పాముల దేవయ్య కత జెవుతా'

నేను సెట్టుకి జారబడి సెప్పు సెప్పు అన్నా!

మన గ్రేమంలో దేవయ్యుండేవోడు. పాముల దేవయ్య. బో యెచ్చుల కారోడు. వేటకంటే నిదుర బోనియ్యడు. వడిసె పందిని వరకతావంటడు. కూసున్న పందిని కొరకతావంటడు. పొదలోని పందిని పొర్లిస్తావంటడు.

మేము కూడ వుల్లాసంగ బోవాలని జెప్పేసి ప్రెయత్నం జేస్తున్నం. కానీ ఆరోజు మాత్రం ఈ నాయకుడు, నేను, సల్లాజు కల్పుకొని పిగిశర్లకొండకు వేలుమార్గం బోయినం. యేదీ? అడవి పందుల కోసం. పోయినప్పుడు వల ఒడ్డినం. నేను కొసనున్న. నాకు పందులంటే కొంచెం భయం. నేను బయపడతా కొసన్నే కూచున్నేవోణ్ణి. కానీ అయినా దగ్గిరికే వొచ్చేయి. ఇప్పుడు గూడ అట్టనే ఆ పందులు నా దగ్గిరికే వచ్చినయ్యి. నా దగ్గిర కొస్తే నేనేం జేసిన్నంటే అయ్యి నా మీద బడి కరుస్తయని జెప్పేసి అయ్యి వలలోకి పోయి పడేటట్టుగా వాటి మీద ఒక రాయేసిన. రాయి వల మీదకి పడింది. పందులు మాత్రం వలలోకి బోలా! లాస్టుకు ఒక పందుంది. అది పన్నెండు మూరలు దూరం దూకింది. ఆ పన్నెండు మూరలు దూకిన పందిని పొడవాలని జెప్పేసి ఈ పాముల దేవయ్యనే వోడు ఆ వనే యెగురుతూ పొయ్యి బరిసె అట్లా ఆవేశిండు. ఆవడంలో ఆ పూవుకు బొయ్యి తుమ్మ కంపలో బడిండు. పడ్డాక నేనేం జేసిన్నంటే పరిగెత్తుకుంటూ వచ్చినా అప్పుడు యెవురూ ఆ దేవయ్యనే వోణ్ణి లేవగొట్టాలా! నేను బొయ్యి రెక్కబట్టుకొని లేపిన. 'యేం! దేవయ్యన్న?' అవన్నా.

'ఓ నాయనా! యేవుంది నాయనా! రవ్వలో బోయింది నాయనా! పొడిచేసేవోణ్ణి' అని జెప్పేసి అంటున్నడు.

అప్పుడు నాకు బాగా నవ్వొచ్చింది.

'ఏ వయా! ముళ్లకంపలో బడి యీ విధంగా వుంటే పొడిసేసేవోణ్ణి అంటుండవే? ఏం దేవయ్య? ఈ మాటలు అంటుండవు. యాంది నువ్వు బొడిసేదని' నేనంటే

'ఓ నాయనో నీ యెగతాళి బోనియ్యి నాకాడో!' అని జెప్పేసి అన్నడు.

'ఓ! యెగతాళి లేదులే, ఏమి లేదులే! నువ్వేం బొడుస్తవులే. అది పన్నెండు మూరలు దెగ్గింది అనుకుంటా నిలబడిపోయినా

## తోక ముడిచిన పాముల దేవయ్య

– ఎండ్లూరి సుధాకర్



తర్వాత ఈ గుచ్చుకున్న ముల్లులు తీవులేసి 'ఓ నాయనా! ఈ ముల్లుల తీపికి నేను తట్టుకోలేకున్న సామీ! ఈ ముల్లులు దీయండి' అని జెప్పేసి మూలిగిండు.

అప్పుడు నేను ముల్లులు దీసి 'యేం? దేవన్నా! బాగా పందిని బొడిసే వోడివే నువ్వు?' అంటే 'ఓ నాయనో! నీకేం దెలుసు నాయనో! పన్ను గేలాడుతున్నవా? నా సంగతి నీకు దెలుసునా?' అప్పుడు 'బో! బొడిసినవులే' అని జెప్పేసి బయలుదేరి యింటికొస్తున్నం. బలుగు నీల్లబోడి అని ఒక రాయి దగ్గరికి వచ్చిన తరువాత

'నీ కాళ్లకు మొక్కుతా గాని నాయనా! నా తొడలో వున్న ఈ ముల్లులు దీస్తేగానీ నీ కాళ్లకు మొక్కుతారో నాయనా!' అని ఏడ్సుకుంటా వున్నడు.

'యేం! దేవన్నా! పన్నెండు మూరలు దూకిన పందిని పొడుస్తునని జెప్పేసి ఒక్క రవ్వలో బోయిందంటుండవే! మా కాళ్లకు మొక్కుతావంటుండవే యిప్పుడు. అంత యీరుడివి, అంతలావు యిదిగా మాట్లాడిన మడిసివే దేవయ్యా! యేంది ఇంతలావు దిగజారి బోయినావు' అంటే

'ఓ నాయనా! నేను బాగుంటే నీ సంగతి జెబుతా గానీ వూరుకో. మాట్లాడినయి చాలుగానీ ఈ సంగతి వూర్లో ఎవురికాడ అనబాకు. సెప్పినవంటే ఎగిచ్చి తంతా' అన్నడు దేవయ్య.

నేను నవ్వుకోని 'సరేగానీ దేవర పంపిస్తావంటివే'? అనడిగిన.

'ఆ దేవర పంపిస్తాలే గానీ! యేం? పన్నెత్తుకొని పోలేవు?' అంటుండడు.

'నేను దీసకెళ్లను. నీ భార్యైతేనే నిన్ను మోస్తది' అని జెప్పేసి నేనన్న.

అష్టదందరం నవ్వుకుంటా దేవయ్యని ఆ వనె రెక్కల మీద కూకుండ బెట్టుకొని వూళ్లోకి దీసుకొచ్చి ఆ బావిదగ్గర ఒదిలేసినం.

యింగ ఆ రోజు నుంచి పందుల పేరెత్తితే సాలు పాముల దేవయ్య తోక ముడుసుకుంటడు.